విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 17। మే । 2025 8 పేజీలు

పుల్వామా బాధితులను మోదీ పరామర్శించకపోవడం సిగ్గుచేటు

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు

విశాలాంధ్ర - అమలాపురం : పుల్వామా దాడి క్షతగాత్రులను పరామర్శించకుండా ప్రధాన మోడీ బీహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లిపోవడం సిగ్గుచేటు అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు విమర్శించారు. 1971లో ఇందిరా గాంధీ యుద్ధ సమయంలో వ్యవహరించిన గుర్తు చేస్తూ ప్రస్తుతం మోడీ వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా విమర్శించారు. అమలాపురంలో శుక్రవారం జరిగిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో తాటిపాక మధు అతిథిగా పాల్గొని మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ పై ప్రజల్లో మళ్ళీ సానుభూతి వస్తుందని అన్నారు. సీపీఐ వల్ల కొత్త బాధ్యత వచ్చిందని అన్నారు. సిపిఐ పార్టీ శతవసంతాలు సందర్భంగా జరుగుతున్న మహాసభలు గ్రామస్థాయి నుండి మండల జిల్లా స్థాయిలో జరుగుతున్నాయన్నారు. అన్నిచోట్ల శాఖా మహాసభలు జరపాలనీ పిలుపునిచ్చారు. రాష్ట్ర పరిశీలకులు నాని, వనజ ముఖ్యమైన శాఖలకు మండల మహాసభలు కూడా జరపాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అన్ని స్థాయిల్లో సభలు, సమావేశాలు జరుగుతున్నాయని మధు చెప్పారు. నిధులు సమీకరణ చేసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి సభ్యుడు విధిగా పార్టీ బలోపేతానికి విరాళాలు సేకరించాలని మధు అన్నారు. సభ్యులు ఇది ఒక బాధ్యతగా రాజమండ్రిలో ఇంటింటికి తిరిగి కార్యక్రమాన్ని 42 రోజులు నిర్వహించామని ఆదివారం కూడా విరామం లేకుండా సమీకరణ చేశామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బలమైన నాయకత్వం ఉండాలని, ప్రతి కార్యకుడు మహాసభను విజయవంతం చేయడానికి కృషి చేయాలని మధు పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగ ప్రభాకర్, జిల్లా కార్యదర్శి కే సత్తిబాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దేవ రాజేంద్రప్రసాద్, ఊటాల వెంకటేష్, మోకా శ్రీను, బివి రమణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ కార్యాచరణ సిద్ధం చేయాలి

విశాలాంధ్ర-భీమవరం: రాబోయే ఖరీఫ్ సీజన్లో జిల్లాలో నాణ్యమైన, స్థానిక వినియోగానికి అనుకూలమైన సాగు రకాలను పండించడానికి కార్యాచరణ సిద్ధం చేయాలనిజాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశమందిరంలో రాబోయే ఖరీఫ్ సీజన్లో జిల్లా, మండల ప్రాంతాలవారీగా ఖరీఫ్ సీజన్లో వరిసాగు రకాలపై జిల్లా, మండల వ్యవసాయ అధికారులతో

2

రోడ్డు భద్రతపై దృష్టి సారించాలి : కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: రోడ్డు భద్రతకు అధికారులు ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు చేపట్టి, ప్రమాదాలు నివారణకు గట్టిగా కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన రోడ్డు భద్రత కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ, పోలీస్, ఆర్టీవో, ఆర్ అండ్ బి, వైద్యశాఖ అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన భద్రత చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం జనవరి నుండి ఏప్రిల్ వరకు 172 ప్రమాదాలు జరగగా, 63 మరణాలు సంభవించాయని, అలాగే గత సంవత్సరం 194 ప్రమాదాలు జరగగా, 75 మరణాలు సంభవించినట్లు తెలిపారు. వాహనదారులు హెల్మెట్ వాడకపోవడం,

మిగతా 2లో

దేవుడి పేరుతో ఆక్రమణలు

- చోద్యం చూస్తున్న ఇరిగేషన్ శాఖ ; కోతకు గురవుతున్న గోదావరి గట్టు
- అధికారుల నిర్లక్ష్యమే కారణం అంటున్న ప్రజలు
- మళ్లీ 1986 నాటి దుస్థితి ఏర్పడినా..?

విశాలాంధ్ర - కొవ్వూరు : గోదావరి తీరం ఆక్రమణలకు గురవుతూనే ఉంది. ఇసుక పేరుతో ఒక ప్రక్క , దేవుళ్ళ పేరుతో మరో ప్రక్క గోదావరి గట్టు ను ఇష్టానుసారంగా తవ్వేసి ఆక్రమించు కుంటున్నారు. తద్వారా గట్టు కోతకు గురవుతుంది. అధికారులు మాత్రం పట్టనట్లు చోద్యం చూస్తూనే ఉన్నారు. అత్త సొమ్ము అల్లుడు దానం అన్నట్టుగా రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కొవ్వూరులో పలు సంఘటనలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఇరిగేషన్ శాఖలో ఈ రకం సంఘటనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. వివరాల్లోకి వెళితే 1986లో వచ్చిన వరదలు కారణంగా కొవ్వూరు పట్టణంలోకి సైతం వరద నీరు ప్రవేశించింది. ఆ తర్వాత చంద్రబాబు ప్రభుత్వం కొవ్వూరు గోదావరి ఒడ్డున కొట్లాది రూపాయలు ఖర్చు చేసి రిటైనింగ్ వాల్ ని నిర్మించారు. అంతేగాక హైదరాబాద్ తరహాలో ట్యాంక్ బండ్ల మార్చి అక్కడ సప్త మునీశ్వరుల విగ్రహాలను నెలకొల్పారు అంతేకాక ఈ బండపై మొక్కలను పెంచి పార్కుగా తీర్చిదిద్దారు. అంతవరకు బానే ఉంది ఇటీవల కాలంలో ఈ ట్యాంక్ బండ్ మీద నిర్మాణాలు జరుగుతున్నాయి. ఎన్ని జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహ రించడం పలు విమర్శలకు తావిస్తోంది తాజాగా గోదావరి ఒడ్డున ఉన్న లాంచీలరేవులో గోదావరి బంద గోడను పగలగొట్టి అక్కడ సూర్య దేవాలయం నిర్మిస్తున్నట్లుగా విశాలాంధ్ర విలేకరి దృష్టికి వచ్చింది. ఈ నేపధ్యంలో ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ మణికంఠ రాజును వివరణ కోరగా స్థలం ఇరిగేషన్ ది అయినప్పటికీ అక్కడ రిటైనింగ్ వాల్ నిర్మించింది ట్యాంక్ బండ్ ఏర్పాటు చేసి ఈ బండను మున్సిపాలిటీ మైంటైన్ చేస్తుంది కాబట్టి మా శాఖకు సంబంధం లేదని సమాధానం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ అక్రమాలపై కథనాల్లో ఇవ్వడానికి ప్రజలకు తెలియజేయడానికి విశాలాంధ్ర నడుం కట్టింది. అయితే ఈ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన స్థానిక ఎమ్మెల్యే నిర్వహించడం కొసమెరుపుగా మారింది.

నియోజకవర్గ పరిధిలో

బీటీ రోడ్లకు శంకుస్థాపన

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

విశాలాంధ్ర - బ్యూరో కాకినాడ : రామచంద్రపురం నియోజక వర్గం పరిధిలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. శుక్రవారం కే గంగవరం మండలంలోని పలు గ్రామాలలో బీటీ రోడ్లనిర్మాణ పనులకు మంత్రి

మిగతా 2లో

గ్రీన్ ఎనర్జీపై అవగాహన కల్పించే దిశగా చర్యలు

– కలెక్టర్ కె.వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మే నెలలో వేడిని ఓడించండి ఇతి వృత్తానికి అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో ఈనెల 17వ తేదీ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సమీక్షించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించవలసిన కార్యక్రమాలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పర్యావరణ స్థిరత్వం, సమాజ వాతావరణ స్థితిస్థాపనకు ప్రోత్సహించడానికి నెలవారీ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఈనెల 17 వ తేదీన నిర్వహించే కార్యక్రమంలో వేడి ప్రభావాలను తగ్గించడానికి ప్రజల్లో అవగాహన పెంచేందుకు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.ఇందులో భాగంగా పిల్లల్లో వాతావరణ అవగాహన పెంపొందించడానికి బీట్ ది హిట్ అనే ఇతివృత్తంపై డ్రాయింగు,వ్యాచారచన పోటీలు నిర్వహించాలన్నారు. నీటిని సంరక్షించడానికి కార్యాలయాలు, ప్రభుత్వ భవనాలు,పాఠశాలలో వర్షపు నీటిని సంరక్షణ నిర్మాణాలను ప్రోత్సహించాలన్నారు. వృద్ధులు, పిల్లలు, కార్మికులు, కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలన్నారు. వడదెబ్బ నివారణ ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న పని ప్రదేశాలు, ఇండ్ల కాలనీలో,

మిగతా 2లో

రోడ్డు భద్రతపై దృష్టి సారించాలి

కలెక్టర్ నాగరాణి (మొదటిపేజీ తరువాయి)

సెల్ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవ్ చేయడం, త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, రోడ్ల మలుపు ప్రాంతాలలో ఎక్కువగా ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా డ్రైవ్ చేయడం, హెల్మెట్ ధరించకపోవడం, మొబైల్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం, త్రిబుల్ రైడింగ్ వంటి వాటిపై 446 కేసులు నమోదు చేసి 38 లక్షల 93 వేల 420 రూపాయలు అపరాధ రుసుము వసూలు చేయడం జరిగిందన్నారు. రోడ్డు నిబంధనలు పాటించని వాహన యజమానులపై కేసు నమోదు చేసి వాహనాలు సీజ్ చేయాలన్నారు. వాహనదారులు ఇష్టానుసారం రోడ్ల పక్కన వాహనాలు పార్కింగ్ చేయకుండా మార్కింగ్ చేసి ఆ ప్రదేశాల్లోనే వాహనాలు పార్కింగ్ చేసుకునే విధంగా ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు రోడ్లలో ప్రమాదాలకు కారణంగా ఉన్న మలుపులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ హెచ్ 216 లోసరి హైవేలో హై మాస్ట్ లైట్స్ వెలగడం లేదని వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లోసరి రోడులో వంతెనలు ఎక్కి దిగేటప్పుడు ఎత్తు పల్లాలుగా ఉండడం వలన ప్రమాదాలకు కారణం అవుతున్నాయని, వీటిని వెంటనే సరిచేసి 15 రోజుల్లో నివేదిక అందజేయాలన్నారు. తాడేపల్లిగూడెం దగ్గర బైపాస్ లో వన్ వే లో వాహనాలు వెళ్లడం ప్రమాదాలు కారణమవుతున్నాయని, రైలింగ్ నిర్మించిన వాటిని తొలగించి అదే రోడ్డును వినియోగిస్తున్నారని ఎన్ హెచ్ అధికారి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఇదే విషయమై గత సమావేశంలో కూడా చర్చించడం జరిగిందని నాలుగు నెలలైనా కఠిన చర్యలు ఎందుకు తీసుకోలేదని పోలీస్ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్.పీ వి.భీమారావు, జిల్లా రవాణా శాఖ అధికారి పి. ఉమామహేశ్వరరావు, ఆర్డీవోలు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, కతీబ్ కౌసర్ బానో, డిఎస్ పిలు ఆర్.జి జై సూర్య, శ్రీవేద, డి.విశ్వనాథ్, ఆర్ అండ్ బి అధి కారి ఏ.శ్రీనివాస్, డిఎంహెచ్వో డాక్టర్ జి.గీతాబాయి, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, రోడ్డు భద్రత కమిటీ సభ్యులు రంగ సాయి, తదితర అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ పరిధిలో బీటీ రోడ్లకు శంకుస్థాపన

శంకుస్థాపన చేశారు. కే గంగవరం మండలంలోని గంగవరం గ్రామం ఆర్ అండ్ బి రోడ్డు నుండి పెద్దింశెట్టి వారిపాలెం, కోటిపల్లి ఆర్ అండ్ బి రోడ్డు నుండి కోట, కోట గ్రామంలోని ఆర్ అండ్ బి రోడ్డు నుండి రాజువారి కోట, బట్లపాలిక గ్రామం నుండి కాపూరి వారిపేట రోడ్డు, ఎర్రపోతవరం గ్రామం నుండి రాళ్లగుంట గ్రామం వరకు సుమారు 4 కోట్ల 50 లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న బీటీ రోడ్లకు మంత్రి శంకుస్థాపన చేసి పైలాన్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధి కూడా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ యేసు రత్నం, వాసంశెట్టి సత్యం, కే గంగవరం సర్పంచ్ కోటి లక్ష్మీ నరసమ్మ, ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

మండల టీడీపీ
అధ్యక్షులుగా సుధీర్ ఏకగ్రీవంగా ఎన్నిక

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఉంగుటూరు మండల టిడిపి అధ్యక్షులుగా వేములపల్లి సుధీర్ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆప్కాబ్ చైర్మన్, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు సమావేశంలో ప్రకటించారు. ఉంగుటూరు మండల టీడీపీ సమావేశం శుక్రవారం భీమ డోలు టీడీపీ కార్యాలయంలో జరిగింది. సుధీర్ ఉంగుటూరు మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి. సుధీర్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పై మండలంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో అభినందించారు.

గ్రీన్ ఎనర్జీపై అవగాహన కల్పించే దిశగా చర్యలు (మొదటిపేజీ తరువాయి)

ఇతర నిర్మాణ పనులు జరుగుతున్న ఆయా ప్రాంతాలలో ద్వామా సంబంధిత శాఖల అధికారులు చలివేంద్రాలు ,షెడ్ నెట్లు ఏర్పాటు,వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు.బస్సు స్టాప్ లు,రైల్వేస్టేషన్లు, మతపరమైన ప్రదేశాలు, మార్కెట్లు ప్రాంతాలలో షెడ్ నెట్ లు ఏర్పాటు చేయాలని సూచించారు. భవనాల వేడిని తగ్గించేందుకు జీవ వైవిధ్యాన్ని ప్రోత్సహించేందుకు పైకప్పు తోట పని, తోటల పెంపకంపై ప్రోత్సహించాలన్నారు.ప్రభుత్వ కార్యాలయాలు తక్కువ ఆదాయ గృహాల పైకప్పులపై సోలార్ రిఫ్లెక్టివ్ వైట్ పెయింట్లను ప్రోత్సహించడం ద్వారా ఇండోర్ ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పశువులకు నీటి ఏర్పాట్లను చేయడం ఉన్న ట్యాంకులను తిరిగి నీటిని నింపటం తదితర వంటి చర్యలను పశువైద్య బృందాలు పర్యవేక్షించాలని అన్నారు.పక్షులు,వివిధ జంతువులకు మట్టి గిన్నెలతో నీటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సూచించారు.ఈ సమావేశంలో డిఆర్వో వి.విశ్వేశ్వరరావు, సిపివో వాసుదేవరావు,డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు, డిసిహెచ్ఎస్ డా.పాల్ సతీష్ కుమార్, జిల్లా వైద్య శాఖ అధికారి డా.ఆర్. మాలిని, డీఈవో కె.వెంకట లక్ష్మమ్మ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాషా, ఉద్యానవన శాఖ డిడి యస్.రామ్మోహన్, ఇరిగేషన్ ఎస్ఈ నాగార్జునరావు, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ సత్యనారాయణ,జడ్పీ సీఈవో కె.భీమేశ్వరరావు, పరిశ్రమల శాఖ డిడి సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడి యం.ముక్కంటి, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఎన్.యస్ కృపావరం, హౌసింగు పిడి సత్యనారాయణ,డిసిఓ శ్రీనివాసు,పశుసంవర్ధక శాఖ జెడి గోవిందరాజులు మున్సిపల్ కమీషనరు భాను ప్రతాప్,తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ కార్యాచరణ సిద్ధం చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పండిస్తున్న పిఆర్ 126 వరి రకాన్ని ఎగుమతి దారులు, వినియోగదా రులు, ప్రాధాన్యత చూపకపోవడం వలన ఈ రకాన్ని ప్రోత్సహించకూడదని వ్యవసాయ అధికా రులకు సూచించారన్నారు. ప్రత్యామ్నాయ రకా లైన ఎన్ ఎల్ ఆర్ 3238, ఎన్ టి యు 1293, ఎం టి యు 1010, ఎం టి యు 1224 వరి రకాలను ప్రోత్సహించాలని అన్నారు. ముఖ్యం గా ప్రతి వ్యవసాయ అధికారి పొలం పిలుస్తుంది సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఎం సివిల్ సప్లైస్ అధికారి టి.శివరాం ప్రసాద్, డిఎస్ ఓ ఎన్.సరోజ, ఏ ఎస్ ఓ ఎం.రవిశంకర్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి గణపతి రావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బి.రామాంజనేయ రాజు, మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సైంటిస్ట్ గిరిజారాణి, డిపిఎం. వై.నూకరాజు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు, కార్యదర్శి కె.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సమీక్షించారు.

డ్రైనేజీ పై ఆక్రమణలు, పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : తల్లాడ నుండి దేవరపల్లి వరకు నిర్మిం చిన 516వ జాతీయ రహదారి కి ఇరువైపులా కిలోమీటర్ మేర మండల కేంద్రమైన కొయ్యలగూడెం టీటీడీ కళ్యాణ మండపం వద్ద నుండి గోపాల పురం రోడ్డులో ఎస్సార్ పెట్రోల్ బంక్ వరకు నిర్మించిన డ్రైనేజీ పై ఆక్రమణలు ఎక్కువ అయ్యాయి, కొన్నిచోట్ల డ్రైనేజీ కృంగిపోయింది. వారి సొంత స్థలాలను వదులుకొని డ్రైనేజీ లను ఆక్రమించుకొని వ్యాపారులకు అద్దెకు కూడా ఇవ్వడం జరుగుతుంది. ఇది ఇలా ఉండగా డ్రైనేజీ పై ఎక్కువ శాతం టి బడ్డీ కొట్లు, కిల్లి షాపులు, ఐరన్ దుకాణాలు, సిమెంటు దుకాణాలు,పాత ఇనుప సామానులు కొనుగోలు చేసి చెత్తను కూడా డ్రైనేజీలపైనే కాకుండా, జాతీయ రహదారిపై కూడా నిలువ ఉంచడం వలన వాహనాలు రాకపోక లకు, అంతరాయం ఏర్పడుతుంది. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పాత ఇనుప సామాన్ల కొనుగోలు చేసే వ్యాపారి పాత ఇనుప సామాన్లను, పాత ప్లాస్టిక్ సామాన్లను డ్రైనేజీ పైనుండి జాతీయ రహదారిపై వరకు నిల్వ ఉంచడం వలన పాదచారులకు, ద్విచక్ర వాహనదారులకు స్వల్ప ప్రమాదాలు చోటు చేసుకుంటు న్నాయి. ఒక్కొక్కసారి ట్రాఫిక్ సమస్య కూడా ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ పై ఆక్రమణలను ఆక్రమించు కున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రక్తహీనతపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-పాలకోడేరు: పాలకోడేరు మండలం గోరగన మూడి అంగన్వాడీ కేంద్రం నందు కిషోర్ వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఐసిడిఎస్ సిబ్బంది రక్తహీనత పై కౌమార దశలో ఉన్న బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ కె. సూర్య కుమారి మాట్లాడుతూ ఐరన్ లోపం వల్ల రక్తహీనత ఏర్పడుతుందని ఈ రక్తహీనత రాకుండా కౌమార దశలో నుంచి గుడ్లు, ఆకుకూరలు, సిట్రస్ జాతికి చెందిన ఫలాలు, నులి పురుగుల నివారణకు మందులు తీసుకోవడం ద్వారా రక్తహీనతను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హెల్త్ అసిస్టెంట్ విజయ్ ప్రసాద్ మాట్లాడుతూ స్త్రీలలో గర్భిణిగా పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త ఎం ఎస్ కే జ్యోతి, ఇతర అంగన్వాడి సిబ్బంది , ఆరోగ్య శాఖ సిబ్బంది, తల్లులు మరియు కౌమార బాలికలు పాల్గొన్నారు.

ప్రజలు డెంగ్యూ వ్యాధి బారిన పడొద్దు

విశాలాంధ్ర-గణపవరం: ప్రతి ఒక్కరు గ్రామీణ ప్రాంతాల్లో డెంగ్యూ వ్యాధి బారిన పడకుండా చర్యలు తీసు కోవాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి కిరణ్మయి అన్నారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం డాక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు అన్ని సచివాలయంలో డెంగ్యూ వ్యాధి పై ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు ఏఎంఎంలు, ఎంపీహెచ్ఏలు ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు అవగా హన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సి హెచ్ ఓ జాలాది విల్సన్ బాబు, ఏఎన్ఎం లు ప్రేమలీల మారతమ్మ హెల్త్ అసిస్టెంట్లు ఎం ఎస్ యోహాన్ నల్లయ్య ఏ కృష్ణ గేదల శ్రీను ఆశ కార్యకర్తలు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులకు డిమాండ్ వేల సంఖ్యలో పనులకు హాజరు

విశాలాంధ్ర-లింగపాలెం: మెట్ట ప్రాంతంలో వ్యవసాయ పనులు లేకపోవటంతో కూలీలకు పనులు లేక ప్రతి ఒక్కరూ ఉపాధి పనుల పై దృష్టి పెట్టారు.దీంతో ఉపాధి పనులకు డిమాండ్ పెరిగింది. మెట్ట ప్రాంతాలలో మే, జూన్, జూలైలో వ్యవసాయ పనులు పనులు ఉండవు. మెట్ట ప్రాంతాలలో 60 నుంచి 70 శాతం మంది వ్యవసాయ ఆధారిత కూలి పనులపైనే జీవనం సాగిస్తూ ఉంటారు. వ్యవసాయ పనులు ఆగిపోవడంతో కూలీలకు పనులు దొరకని పరిస్థితి నెలకొంది.దీంతో కొన్ని కుటుంబాలలో రోజువారి అవస రాలు తీర్చుకోవటానికి అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఉపాధి పథకం అమలులో ఉండటంతో కూలీలు ఈ పను లకు అధిక సంఖ్యలో వెళు తున్నారు. ఉపాధి కూలీలకు ప్రభుత్వం రోజువారి వేతనం ఒక్కొక్కరికి రూ.307లుగా నిర్ణయించారు. కనీసం రోజుకు రూ294 లకు తగ్గకుండా వేతనం ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకొన్నారు. వేతనం పెరగటంతో ఈ పథకంలో పనులకు వచ్చేవారి సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. దీనివల్ల ఉపాధి పనులకు డిమాండ్ ఏర్పడింది. లింగపాలెం మండలంలో ప్రతిరోజు 7వేల మంది కూలీలకు ఉపాధి పనులు చేసేందుకు అనుమతులు ఉన్నాయి. అయితే పనులకు అధికంగా కూలీలు వస్తున్నారు. మండలంలో ప్రతిరోజు 8,500 మంది ఉపాధి కూలీలు పనులకు హాజరవు తున్నట్లు అధికారులు తెలిపారు. కూలీలతో చెరువుల పూడికతీత, కాలువల మరమ్మత్తు, నీటి నిల్వ కుంటల నిర్మాణపు పనులు చేస్తున్నారు. జూలై చివరి వరకు పనులు జరుగుతూనే ఉంటాయని అధికారులు వెల్లడించారు. ఈ పనులు కోసం ఖర్చు పెట్టే ప్రతి పైసా గ్రామాల అభివృద్ధికి దోహదపడాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలన్ని...పరిష్కరిస్తాం

విశాలాంధ్ర - నరసాపురం: పరిష్కార వేదికలో వచ్చిన ప్రజా సమస్యల న్నింటిని పరిష్కారం చేస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ పొత్తూరి రామ రాజు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (గ్రీవెన్స్) లో ప్రజా సమస్యలు స్వీకరించి మాట్లాడారు. పెరుగుతున్న ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకోవడం, వాటిని తక్షణం పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం లక్ష్యంగా ఈ వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వచ్చిన ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని హామీ ఇవ్వారు.నియోజకవర్గంలో పలుప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమైక్య చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, నరసాపురంపట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ, మావూరి ఆనంద్, నాగ్రా నరేష్, దొంగ మురళి, కొలపర్తి శివ, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలను ఉపేక్షించేది లేదు : కలెక్టర్

విశాలాంధ్ర-భీమవరం: లింగ నిర్ధారణ పరీక్షలను ఎట్టి పరిస్థి తుల్లో ఉపేక్షించేది లేదని, స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించాలని కలెక్టర్ చదల వాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన పిసి& పిఎన్ డి టి యాక్ట్, ఏఆర్టి అండ్ సరోగసి యాక్ట్ అమలుపై సమీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదని, తనిఖీల్లో పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమాజంలో స్త్రీ, పురుష భేదం ఉండకూ డదని, అన్ని రంగాల్లో స్త్రీలు ముందంజలో ఉంటున్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. స్కానింగ్ సెంటర్లో వెల్లడించిన, పరీక్షలు నిర్వహించుకునే వారు ప్రలోభ పెట్టి ఫలితాలను తెలుసుకుంటే ఖచ్చితమైన చర్యలు ఉంటాయని తెలిపారు. గత సంవత్సరం కంటే కాళ్ళ, పెనుమంట్ర మండలాల్లో సెక్స్ రేషియో తగ్గడంపై తగిన సమీక్ష నిర్వహించాలని డిఎంహెచ్ఓను ఆదేశించారు. జిల్లాలోని 159 స్కానింగ్ సెంటర్లను ప్రతి మూడు నెలలకు ఒకసారి పూర్తి స్థాయిలో తనిఖీ చేయాలన్నారు. ఆ నిద్ర వస్తున్నారు. అలాగే ఏ విధమైన అనారోగ్య కారణాలు లేకుండా రెండవ కాన్పు, ఇద్దరు ఆడపిల్లలు ఉండి మూడవ కాన్పు అబార్షన్ చేయించుకున్న వారి జాబితాను క్రోడీకరించి విపులంగా సమీక్షించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అకారణ అబార్షన్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏప్రిల్ 2024 నుండి మార్చి 2025 వరకు జిల్లాలోని ఫెర్టిలిటీ సెంటర్లలో నమోదైన ఏఆర్టి అండ్ సరోగసి కేసులపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా అడిషనల్ ఎస్పీ వి. భీమారావు, డిఎం అండ్ హెచ్ డాక్టర్ జి.గీతా బాయ్, ఆర్డీవోలు దాసిరాజు, కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఖతీబ్ కౌసర్ భానో, డీఎస్పీలు ఆర్.జి జై సూర్య, శ్రీ వేద, డి.విశ్వనాథ్, ఇన్చార్జ్ డిపిఎంఓ డాక్టర్ సిహెచ్ ధనలక్ష్మి, డాక్టర్ భావన, తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏతోనే సంక్షేమ అభివృద్ధి

విశాలాంధ్ర -భీమవరం: ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ అభివృద్ధి సాధ్య మని భీమవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పోలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి నాయకులు స్థానిక నియోజకవర్గ ప్రజల సమస్యలను, వారి వినతి పత్రాలను శుక్రవారం తోట సీతారామలక్ష్మీ కి అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి వినతి పత్రాలు తీసుకున్న నాయకులను అభినందించి మాట్లాడుతూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు పామర్తి వెంకటరామయ్య, ఉప్పులూరి చంద్రశేఖర్, పట్టణ టిడిపి అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, మండల తెలుగు యువత అధ్యక్షుడు కొయ్యలగడ్డ గణపతి, గ్రామ వార్డు అధ్యక్ష కార్యదర్శులు స్థానిక ప్రజలు ద్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, ALLURI KUSUMA SREE CHANDANA (New Name), W/o. ALLURI JAGADEESH VARMA, Previously Called KUSUMASRI CHANDANA ALLURI (Old Name), Resident of Flat No:305, D.No. 1-3-7/4, Cosmo Club Road, Near Addavanthena, Bhimavaram, W.G.Dt., Pin -534202, Andhra Pradesh. I have changed my name from KUSUMASRI CHANDANA ALLURI (Old Name) To ALLURI KUSUMA SREE CHANDANA (New Name) for all practical purposes.

ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి

సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్

విశాలాంధ్ర-ఏలూరు : అర్హులం దరికీ ఇంటి స్థలం ఇచ్చి నిర్మా ణానికి రూ.5లక్షల ఇవ్వాలని సీపీఐ ఏలూరు ఏరియా కార్య దర్శి ఉప్పులూరి హేమ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో ఇల్లు లేని పేద ప్రజలకు పట్టణ ప్రాం తాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వా లని, ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ గత కొద్ది నెలలుగా ప్రజల నుండి దశల వారీగా అర్జీలు నమోదు చేయించి మొదటి దశలో గ్రామ, వార్డు సచివాల యాల్లో రెండవ దశలో జిల్లా కలెక్టర్‌కు అందజే శారు. ప్రస్తుతం అర్జీలను పరిశీలించి తక్షణమే అర్హులైన పేదవారికి ఇళ్ల స్థలాలు ఇంటి నిర్మాణా నికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 19న సోమవారం ఉదయం గం.11 లకు ఏలూరు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించి, తహశీల్దార్‌కు వినతి పత్రం అందించనున్నారని, హేమ శంకర్ తెలి పారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

టీడీపీ సీనియర్ నాయకునికి పరామర్శ

విశాలాంధ్ర-కొయ్యలగూడెం :టీడీపీ పార్టీ సీని యర్ నాయకులు, పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, పారేపల్లి రామారావు ఇటీవల కాలంలో గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించు కొని ఇంటి వద్దనే ఉంటూ విశ్రాంతి తీసుకుం టున్న ఆయనను బయ్యనగూడెం గ్రామ ంలో ఆయన స్వగృహంలో చింతలపూడి నియో జకవర్గ శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ ఆయన ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

అంతరాష్ట్ర నేరస్తుడు అరెస్ట్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : దేవాలయాల్లో చోరీలకు పాల్పడు తున్న అంతర్ రాష్ట్ర నేరస్తుడిని ఏలూరు త్రీ టౌన్ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుండి 30 గ్రాముల బంగారు ఆభర ణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసుకు సంబం ధించిన వివరాలను శుక్రవారం 3 టౌన్ సీఐ కోటేశ్వరరావు వెల్లడించారు. కృష్ణాజిల్లా విజయ వాడ నగరంలోని కొత్తపేట ప్రాంతా నికి చెందిన ఈమని రాంబాబు గత కొంత కాలంగా దేవాల యాల్లో దొంగతనాలకు పాల్పడు తున్నాడు. దొంగతనం చేయాల నుకున్న గుడిని ముందుగా ఎంచుకొని, భక్తుడి లాగా గుడిలోనికి ప్రవేశించి పూజారితో మాటలు కలుపుతూ అతను పరధ్యా నంగా ఉన్నప్పుడు గానీ, దూరంగా వెళ్ళినప్పుడు గాని అతనికి తెలియకుండా, దేవునికి అలంకరించి ఉన్న బంగారు వస్తువులను దొంగతనం చేసి పరారవ్వడం నేరస్తుడు రాంబాబు ప్రత్యేకత. ఇందులో భాగంగానే రాంబాబు గతంలో 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్రంపాడు ప్రాంతంలో గల సౌభాగ్య లక్ష్మి దేవాలయంలో పూజారిలేని సమయంలో అమ్మ వారి మెడలో ఉన్న బంగారు ఆభరణాలు అపహరించి పరార య్యాడు. అంతరాష్ట్ర పోలీస్ స్టేషన్లలో మరో 50 కేసుల వరకు నమోదై ఉన్నట్లు పోలీ సుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఎంతో ప్రతిభ కనబ రిచిన సీఐ కోటేశ్వరరావు, ఎస్సై రాంబాబు, సిబ్బందిని ఎస్పి శివ కిషోర్ అభినందించారు.

గణపవరంలో తిరంగా ర్యాలీ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం లో భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఎన్డీఏ కూటమి నాయకులు శుక్రవారం తిరంగా ర్యాలీ నిర్వహిం చారు. ఈ ర్యాలీ గణపవరం పోలీస్ ఐలాండ్ నుండి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ వరకు సాగింది. భారీ త్రివర్ణ పతాకంతో ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆఫ్కాబ్ చైర్మన్, డి సి సి బి చైర్మన్ గన్ని వీరాంజనేయులు, బిజెపి నాయకులు ఎస్ మాలతి రాణి పాల్గొన్నారు. గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ మాట్లా డుతూ భారత సైన్యం అద్భుత పోరాట ంతో సింధూరు విజయవంతం అయిం దన్నారు. ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చేసిన భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ప్రయాణం త్యాగం చేసిన వీర జవాన్లకు శ్రద్ధాంజలి అర్పించి దేశభక్తిని ప్రోత్సహించడమే తిరంగా ర్యాలీ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. భారత సైనికులు సాహసాన్ని ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం దృఢత్వాన్ని ప్రజలకు తెలియజేస్తుందన్నారు ఆపరేషన్ సింధూర్ విజయంతో దేశ భద్రతపై మన నమ్మకం మరింత బలప డిందన్నారు. కార్యక్రమంలో అధికా రులు కూటమి నాయకులు టీడీపీ, జనసేన బిజెపి మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యం శిబిరం

విశాలాంధ్ర-తణుకు:అక్కమాంబ టెక్స్టైల్ ఆధ్వర్యంలో కార్మికులకు వైద్య సహాయ నిమిత్తం శుక్రవారం తణుకు యాపిల్ హాస్పిటల్ వైద్యులుచే ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్యులు గుండె, కిడ్నీ, ఊపిరితి త్తుల వ్యాధులకు సంబంధించి వైద్య నిపుణులు పాల్గొని వివిధ రకాలైన ఈసీజీ, టుడిఎకో, షుగర్ సంబంధించిన వైద్యపరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య పరీక్షల్లో యాపిల్ హాస్పిటల్ కార్యాలజిస్ట్, వైద్యులు డా. జీ.వి.వి.ఎస్.ఎన్. రాజు, నెఫ్రాలజిస్ట్‌డా. బి.సాయి హరి, పల్మనాలజిస్ట్ డా.కే కోటేశ్వరరావు, హాస్పిటల్ ఎండి పీడియాట్రిక్ డా. వి సుందరరావు, ఏవో బ్రహ్మజీ,తదితర వైద్యులు వైద్యులు వైద్య సాయం చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు సిహెచ్ దుర్గాప్రసాద్, ఎస్.ఫణీంద్ర కుమార్, పెద్దిరాజు, పి. శ్రీను, ఏ.నాగేశ్వరరావు, జి.కనకారావు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత

విశాలాంధ్ర-టి నరసాపురం: గ్రామ స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు తెలిపారు. శ్రీ రామవరం గ్రామంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అడపా నాగరాజు జన్మదిన వేడుకల్లో శుక్రవారం పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామ్మ గూడెం గ్రామంలో స్థానిక సమస్యలపై గ్రామస్థులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్మ గూడెంలో రోడ్లు, గృహాలు, మంచి నీటి సమస్యలపై నివేదిక పంపాలని అధికారులను ఆదేశించారు. రామ్మ గూడెంలో అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు నివేదికలు పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కరాటం రాంబాబు, కరాటం సాయి, గద్దమనగు రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర - కలిదిండి: వ్యాధుల బారినపడకుండా ఉండాలంటే పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పి.హెచ్.సి వైద్యులు పి హేమంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సంద ర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు ఉన్న పాత్రలపై మూతలు వేసుకోవాలని సూచించారు. దోమల పెరుగుదలను అరికట్టి డెంగ్యూ వ్యాధిని నివారించాలన్నారు. సీహెచ్ఓ కృష్ణ కిషోర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ డెంగ్యూ దినోత్సవం పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-పాలకోడేరు: జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించు కొని పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, గొరగన మూడి గ్రామ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ సిహెచ్. వి.రంగం నాయుడు మాట్లా డుతూ డెంగ్యూ ఫీవర్ అనేది కొన్ని రకాల దోమలు కుట్టడం వల్ల వస్తుం దని, కొన్ని సందర్భాలలో డెంగీ ఫీవర్ అధికమైతే ప్రాణాపాస్థితి ఏర్పడు తుందని అందువల్ల వ్యాధికి కారణమైన దోమలు వ్యాప్తి చెందకుండా పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మరొక వైద్యాధి కారి డాక్టర్ స్వర్ణ నిరంజన్, హెచ్ వి, హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎం లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ జ్వరాలపై అవగాహన పోస్టర్ల విడుదల

- కలెక్టర్ కె.వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు : డెంగీ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ముద్రించిన బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి శుక్రవారం ఏలూరు కలెక్టరేట్లో విడుదల చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ తీవ్రజ్వరం, కండరాల నొప్పులు, కనుగుడ్లు నొప్పులు డెంగీ లక్షణాలన్నారు. వ్యాధి లక్షణాలపై జిల్లాలోని పీహెచ్సిల పరిధిలో అవగాహన, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య సిబ్బంది విస్తృతంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.దోమతెరలు వాడటం,ఇంటి కిటికీ లకు, తలుపులకు జాలీలు బిగించుకోవాలన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఆర్.మాలిని, డియంవో పీ.యస్.యస్. ప్రసాదు, ఏయంవో జె.గోవిందరావు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలో పాల్గొన్న ఏలూరు జిల్లా ప్రతినిధులు

విశాలాంధ్ర-ఏలూరు: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలు సందర్భంగా తిరుపతి నగరంలో జరుగుతున్న ప్రతినిధుల సభకు ఏలూరు జిల్లా నుంచి ప్రతినిధులు హాజరైనారు. హాజరైన వారిలో ఏలూరు జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి రాజు, జిల్లా కన్వినింగ్ మెంబెర్స్ కురెళ్ల వరప్రసాద్, బంధం నాగేశ్వ రరావు, సభ్యులు ఎస్.అవినాష్, టి.అంబేద్కర్, ఎం. క్రాంతి, పి.చందు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలి

విశాలాంధ్ర-ఏలూరు: ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించి మంచి ఫలితాలు సాధించాలనీ జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అన్నారు.శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా పంచాయతీ శాఖ అధికారి,జడ్పీ సీఈఓ, ఆయా మండలాల అధికారులు, ఆయా పురపాలక సంఘాల కమీషనర్లులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛంధ్రా జరిగే కార్యక్రమంలో రాష్ట్రంలో జిల్లా గౌరవ ప్రధానమైన స్థానంలో ఉంచేందుకు, ప్రస్తుత పనితీరు బేరీజు వేసుకుని కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పట్టణాలు, గ్రామాలతో పాటు మారుమూల గ్రామాల్లో కూడా స్వచ్ఛంధ్రా కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.ఖాళీ స్థలాలు కలిగిన యజమానులు స్వచ్ఛందంగా చెత్తను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు బాగా పనిచేసేలా చూసి నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. అంగన్వాడి సెంటర్లు,ప్రభుత్వ హాస్పిటల్స్, పర్యాటక కేంద్రాలు, బస్టాండులు, తదితర ప్రాంతాలలో స్వచ్ఛంధ్రా కార్యక్రమాలు బాగా జరగాలన్నారు. పరిష్కారం కాని సమస్యలు ఉంటే అర్జీదారునికి ఏ కారణం చేత సమస్యను పరిష్కారం చేయలేక పోతున్నామో అర్థమయ్యేలా వివరించాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టరు ఛాంబరు నుండి జిల్లా పంచాయతీ శాఖ అధికారి కె.అనురాధ,జిల్లా పరిషత్తు సిఇవో కె. భీమేశ్వరరావు, ఆయా మండలాలు,ఆయా పురపాలక సంఘాలు నుండి కమీషనర్లు,డివిజనల్ పంచాయతీ శాఖ అధికారులు, డియల్డివోలు,యంపిడివోలు, ఈవోపిఆర్డీలు,తదితరులు పాల్గొన్నారు.

రెండు పూట్ల పని విధానం రద్దు చేయాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు

విశాలాంధ్ర - అత్తిలి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనిచేస్తున్న శ్రామికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం అత్తిలి మండలం అత్తిలి, ఊరదలపాలెం గ్రామాలలో పనిప్రదేశంలో పనిచేస్తున్న ఉపాధి శ్రామికులను పరిశీలించారు. శ్రామికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ చట్టం పేద ప్రజల కోసం ఏర్పాటు చేసినటువంటిది. అలాంటి చట్టం శ్రామికులకు శాపంగా మారిందన్నారు. గ్రామానికి మూడు కిలోమీటర్ల పైబడి పనికి వెళుతున్నారు. ఉదయం ఐదు గంటలకి 12 గంటల వరకు మండే ఎండలో పనిచేస్తు న్నారు. జియో ట్రాకింగ్ ఫోటోలు వలన శ్రామికుల ఇబ్బంది పడుతున్నారన్నారు. తీసిన ఫోటోలు మరలా తీయడం వల్ల ఇంటికి వెళ్లి మళ్లీ పని ప్రదేశంలోకి రావడం వల్ల భారంగా మారిందన్నారు. కొన్ని ప్రాం తాల్లో రెండు పూటల పని విధానం చేయిస్తున్నారని దీని శ్రామికులు పనికి దూరమయ్యే అవకాశం ఉందని ఆయన అన్నారు.కూలి రేట్లు పెరిగిన ధరల కనుగొనంగా 307 నుండి 700 పెంచాలని ఆయన అన్నారు. ఈ చట్టం కాపాడుకోవడానికి అసంఘటి తరంగా కార్మికులు సంఘటితంగా కలిసికట్టుగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

శిరీష కుటుంబాన్ని ఆదుకోవాలి

– సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య...
– సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-పోలవరం: ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో సరైన వైద్యం అందక మృతిచెందిన పేదగిరిజన గర్భిణీ మహిళ శిరీష కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని, వైద్య నిర్లక్ష్య కారణాలపై విచారణ చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు కొత్తకుంకాల గ్రామానికి వెళ్లి మృతురాలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య, బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రైవేటు ఆసు పత్రిలో వైద్యం చేయించు కోలేని పేదలు, ఏజెన్సీ గిరిజనులు హాస్పిటల్కి వస్తారని, వారిపై మానవత్వంతో, ప్రేమతో వైద్యం అందించవలసి ఉంద న్నారు. కాని గిరిజనులకు సక్రమంగా సరైన వైద్యం అందడం లేదని,ఇది భాద్యతా రాహిత్యం అవుతుందన్నారు. మృతురాలు శిరీష కుటుంబాన్ని ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ శిరీష కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇటువంటి దుర్ఘటనలు పునరావృత కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరి వెంట సీపీఐ పోలవరం మండల కార్యదర్శి జల్లేపల్లి వెంకట నరసింహారావు(జె.వి), జంగారెడ్డి గూడెం మండల కార్యదర్శి జె.వి రమణరాజు, సొబ్బన రాజశేఖర్ బాబులు ఉన్నారు.

సొసైటీ అధికారులపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర- జీలుగుమిల్లి : జీలుగు మిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం బ్యాంకులలో రుణాలు పొంది మరణించిన వారిపై ఉన్న అప్పును రద్దు చేస్తూ దీర్ఘకాలిక బకాయిలు కలిగి ఉన్న రైతులకు ఓటీఎస్ విధానంలో చెల్లింపులు చేపట్టాలని రైతులు, అఖిలపక్షం నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల జీలుగుమిల్లి సొసైటీ పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన రైతులు పై బహిరంగ ప్రకటన చేపట్టడంపై రైతులు రైతు సంఘాలు అఖిలపక్ష నాయకులు జిల్లా కలెక్టర్ కి, సహకార మంత్రి అచ్చం నాయుడుకు, స్థానిక శాసనసభ్యులు చిర్రి బాలరాజు కు రైతులు అందరూ ఏకతాటిగా ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొంటున్నారు. దీర్ఘకాలిక బకాయిలు వసూలు విషయంలో ఇప్పటివరకు నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు ఒకే కుటుంబానికి చెందిన మరణించి న వ్యక్తులను బ్రతికున్న రైతులను అల్లరి పాలు చేసేందుకు సహకార సంఘం అధికారులు పై చర్య తీసుకొనుటకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయటానికి ఈ ఇరువురు అధికారులు ప్రయత్నం చేశారని తేటతెల్లమవుతుందని ప్రభుత్వం ఏ రైతుని ఇబ్బంది పెట్టొద్దని రాష్ట్రస్థాయిలో డీసీఓలకి, డిసిసిబి ఆదేశాలు జారీ చేసినట్లు రైతులు గుర్తు చేస్తున్నారు. కానీ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జీలుగుమిల్లి సొసైటీ అధికారుల అత్యుత్సాహం చర్యలపై నిరసన వ్యక్తం చేయాలని రైతులు పిలుపునిస్తున్నారు. రాష్ట్రంలోనే బ్యాంకులు ఓ టి ఎస్ విధానాన్ని అమలు చేయడం ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో రైతులు రుణాలు చెల్లించి ప్రశాంతంగా ఉన్నారని, కానీ కోఆపరేటివ్ సొసైటీలో ఓటిఎస్ విధానం అమలు చేయకపోవడంతో తీసుకున్న రుణాలు అన్ని మొండిబకాయలగా మిగిలిపోతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. రైతు చనిపోయిన వ్యక్తికి కుటుంబానికి మొండి బకాయిగా ఉన్న రైతు కుటుంబానికి రైట్ ఆఫ్ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ కి జిల్లా కలెక్టర్ పరిధిలోకి డిసిఓ పరిధిలో నిర్ణయాలు తీసుకుంటే మంచిదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా రైతులను అల్లరి చేసేందుకు అత్యుత్సాహం చూపిన స్థానిక అధికారులు పై చర్య తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సారా రహిత జిల్లాగా పశ్చిమ : కలెక్టర్

విశాలాంధ్ర-భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాను సారా రహిత జిల్లాగా ప్రకటించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, ఇప్పటివరకు ఫున్న సారా తయారీదారులు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల ద్వారా లబ్ది పొందాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవోదయం 2.0 (నాటుసారా నిర్మూలన) కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఎక్సైజ్ డిసి బి.శ్రీలత, తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం సారా రహిత రాష్ట్రంగా మార్చాలని నవోద యం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించి లక్ష్యాన్ని నిర్దేశించింది న్నారు. జిల్లాలో సారా తయారీ పూర్తిగా నిర్మూలించడం జరిగిందని వెల్లడించారు. సారా తయారీ, విక్రయాలతో జీవనం సాగించే వారు ఇకపై ఆపనులు మానుకొని, ప్రత్యా మ్నాయంగా ఉపాధి పొందేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలను తయారీదారుల భార్యల పేరున ఆర్థిక సహాయాన్ని సమకూర్చడం జరిగింద న్నారు. జిల్లాలో ఐదు ప్రాంతాల్లో సారాయి తయారీ, విక్రయం ఉందని, దానిని పూర్తిగా నిర్మూలించే దిశగా 13 మంది లబ్ధిదారులను గుర్తించి ఒక్కొక్కరికి రూ.ఒక లక్ష చొప్పున చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. దీనితో పశ్చిమగోదావరి జిల్లాను సారాయి రహిత జిల్లాగా ప్రకటించుకోవడం జరిగిందన్నారు. సారా తయారీకి సంబం ధించిన సమాచారాన్ని 14405 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేయవచ్చని, సంబంధిత టోల్ ఫ్రీ నెంబర్ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు.

కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని జొన్నాడ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. శుక్రవారం గ్రామానికి చెందిన తాడి శ్రీనివాస్ రెడ్డి (బట్టీ శ్రీను) జన్మదినోత్సవం సందర్భంగా ఆయన మిత్రుడు గొడవర్తి దుర్గాప్రసాద్ (బాబి) తన సొంత నిధులతో సుమారు 80 మంది ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. అలాగే వేసవికాలం చివర వరకు ఈ మజ్జిగ ప్యాకెట్లు కూలీలకు పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఈ మజ్జిగ ప్యాకెట్లను కూలీలకు అందించడం జరిగిందన్నారు. ఉపాధి హామీ కూలీలు శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న గొడవర్తి దుర్గాప్రసాద్ (బాబీ)ని అభినందించారు. ఈ కార్యక్రమంలో భావన శ్రీనివాస్, వీరి సందీప్, పట్టెం వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగైన చెరువుల పై సర్వే ప్రారంభం

విశాలాంధ్ర - సీతానగరం: కనుమరుగు అయిపోయిన చెరువుల పై సర్వే ప్రారంభించారు. మండలంలో నాగంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల సుమారు 60 ఎకరాలు విస్తరణం గల రెండు చెరువులు కనుమరుగు అయిపోతున్నాయి అని జిల్లా కలెక్టర్ కు పిజిఆరెస్ ద్వారా చిడిపి నకుల సురేష్ అర్జీ సమర్పించగా దీనిపై సర్వేయర్ల ద్వారా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా శుక్రవారం నాగంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల సుమారు 29 ఎకరాల విస్తీర్ణం గల రాముడు చెరువు మండల సర్వేయర్ గౌతమ్, పంచాయితీ కార్యదర్శి స్టీఫెన్, వి ఆర్ ఓ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సర్వే ప్రకారం చెరువు చాలా వరకూ ఆక్రమణకు గురయ్యింది అని అధికారులు నిర్ధారించారు. దీనిపై తహసిల్దార్ ఏ శ్రీనివాస్ వివరణ కోరగా ఆక్రమణలు చేసిన రైతులను ఇక పై అక్కడ సాగు చేయడానికి వీలులేదు అని ఒక వేళ సాగు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సర్వేలో విలేజ్ సర్వేర్లు వెంకటేష్, మహేష్, సర్పంచ్, వి ఆర్ ఏ వీరబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్లోరినేషన్ కేక్‌వాటర్‌తో సురక్షితమైన నీరు

విశాలాంధ్ర - అనపర్తి : క్లోరినేషన్ కేక్ వాటర్ ట్యాంక్‌లోకి పంపించడం ద్వారా సురక్షితమైన నీళ్లు ప్రజలకు అందుతాయని డిప్యూటీ ఎంపీడీవో ఎమ్ఎస్ఎన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కరకుదురు వాటర్ ట్యాంక్ పరిశీలించి ఇటీవల ఆ ట్యాంక్‌లో వేయించిన ఇన్‌లైన్ క్లోరినేషన్ పనిచేసే విధానాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం స్వయంగా డిప్యూటీ ఎంపీడీవో క్లోరినేషన్ కేక్ జంక్షన్ బాక్స్ వేసి క్లోరినేషన్ నీళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. క్లోరినేషన్ కేక్ లు ట్యాంక్ ల్లో ఉపయోగించాలని కార్యదర్శులను డిప్యూటీ ఎంపీడీవో ఎంఎస్ఎన్ రెడ్డి ఆదేశించారు.

పారదర్శకంగా బదిలీలు

విశాలాంధ్ర - కాకినాడ : శుక్రవారం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి సాధారణ బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఒకే పోలీసు స్టేషన్లో 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న మొత్తం 85 మంది సిబ్బందిలో, 19 మంది ఏఎస్సైలు, 43 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 23 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. ఈ కౌన్సిలింగ్ ప్రక్రియలో ఖాళీల వివరాలు జాబితాను ప్రొజెక్టర్ ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెల్లడించారు. సిబ్బంది తమ ఇష్టానికి అనుగుణంగా, ఖాళీలు ఉన్న పోలీస్ స్టేషన్లను ఎంచుకునేలా అవకాశం కల్పించారు. పోలీస్ స్టేషన్ల మధ్య సమతుల్యతను పాటిస్తూ పట్టణాల్లో పని చేస్తున్న సిబ్బందిని రూరల్ స్టేషన్లకు, రూరల్ స్టేషన్లల్లో పని చేస్తున్నవారిని పట్టణ ప్రాంత పోలీస్ స్టేషన్లకు బదిలీ చేశారు. భార్యాభర్తలు ప్రభుత్వ ఉద్యోగస్తులుగా ఉన్నవారికి, అనారోగ్య కారణాలతో ఎదురవుతున్న సిబ్బందికి అవసరమైన మినహాయింపులు ఇచ్చి వారు కోరిన ప్రాంతాలకు బదిలీ చేశారు. బదిలీల ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారం, పారదర్శకంగా, ఎటువంటి మనోభేదాలు లేకుండా నిర్వహించడంతో సిబ్బంది హర్షాతిరేకాలు వ్యక్తంచేసి, జిల్లా ఎస్పికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిబ్బందితో మాట్లాడుతూ, ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా, ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వీజీఎ భాస్కర రావు, జిల్లా పోలీస్ కార్యాలయ పరిపాలన అధికారి మూర్తి, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహారం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : పెరట్లో రింగులు ఏర్పాటు చేసుకొని ప్రకృతి వ్యవసాయం చేయడంతో ఆరోగ్యకరమైన ఆహారాన్ని పండించుకోవచ్చుని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ జె ఎలియాజర్ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఏలేశ్వరంలోని వైఆర్‌సిలో మజ్జి నాగేశ్వరరావు పొలంలో రింగ్స్‌లో ప్రకృతి వ్యవసాయం చేసే పద్ధతులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాళీ ప్రదేశాలలో రింగులు ఏర్పాటు చేసుకుని ఇసుక, ఘనజీవామృతం, కోకో, ఫిట్, మట్టిని వినియోగించి శాశ్వత పెరటి తోటను తయారు చేసుకునే విధానంపై వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన పోషకాలు గల ఆహారం లభిస్తుందని తక్కువ ఖర్చుతో ఇంటి వద్దనే కూరగాయలు ఆకుకూరలు పండించ వచ్చునని పేర్కొన్నారు. ఎన్ఎఫ్ఏ నాయుడు మాట్లాడుతూ ప్రతి మానవుడికి ముఖ్యంగా కావలసింది ఆరోగ్యం మాత్రమే అన్నారు. ఆరోగ్యవంతమైన వ్యక్తుల ద్వారా ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కో-ఆర్డినేటర్ గణేష్, యూనిట్ ఇంచార్జ్ బివివి సత్యనారాయణ, డిజిటల్ ఎల్-2 దేవి, ముదర యేసుబాబు, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

నిధుల విడుదలకు కృషి చేయాలని వినతి

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : బిల్డింగ్ ప్లాన్లు, అపార్ట్మెంట్లు, లేఅవుట్లు అనుమతుల్లో లబ్ధిదారులు కాకినాడ డెవలప్మెంట్ అథారిటీకి చెల్లించిన నిధుల్లో సంబంధిత గ్రామపంచాయతీకి రావాల్సిన వాటా నిధుల విడుదలకై కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ కృషి చేయాలని మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆర్థికంగా నిస్సహాయ స్థితిలో ఉన్న పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేయడానికి ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అహర్నిశలు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఆ దిశగా ఇతర ప్రభుత్వ శాఖలు కృషి చేస్తే పంచాయతీలలో కనీస వసతులు కల్పించడానికి అవకాశం ఉంటుందన్నారు. గతంలో పట్టణ ప్రణాళిక అభివృద్ధి సంస్థ బిల్డింగ్ ప్లాన్లు, లేఅవుట్లు, అపార్ట్మెంట్లను మంజూరు చేసే సమయంలో పంచాయతీలకు అన్ని రకాల రుసుంలు చెల్లించే వారన్నారు. ఆ నిధులతో పంచాయతీలలో రోడ్లు, డ్రైన్లు వంటి కనీస వసతులు చేకూరేవన్నారు. తదనంతరం రాష్ట్ర ప్రభుత్వం పట్టణ అభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేసి పంచాయతీలలో నిర్మితమయ్యే 358 చదరపు మీటర్లు పైబడి ఉన్న ఇంటి ప్లాన్లు, అపార్ట్మెంట్లు, లేఅవుట్లు మంజూరు చేసే అధికారాన్ని వాటికి కట్టబెట్టిందని అన్నారు. దీంతో లబ్ధిదారులు నేరుగా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీకి సంబంధిత రుసుములు చెల్లిస్తున్నారని అన్నారు. అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వసూలు చేసిన నిధులలో గ్రామపంచాయతీకి ఇవ్వాల్సిన వాటా నిధులను విడుదల చేయడం లేదని అన్నారు. దీంతో పంచాయతీలలో పారిశుధ్య కార్మికులకు జీతాలు కూడా చెల్లించలేని స్థితి నెలకొందని అన్నారు. మరోవైపు పంచాయతీలలో హేబిటేషన్ పెరగడంతో ప్రజల కనీస అవసరాలు తీర్చలేని దుస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు స్థానికులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మూడు లక్షల పనిదినాలు

విశాలాంధ్ర - పెదపూడి : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులకు సంబంధించి సిబ్బందితో ఎంపీడీవో కె నరేంద్రరెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ ఏడాది మండలంలో మూడు లక్షల పని దినాలు కల్పించడం, 7 వేల 500 కుటుంబాలకు పని కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే విధంగా ఇంకా పలు అంశాలపై ఎంపిడివో చర్చించారు. మండలంలో ఉపాధి కూలీలు చేసే పని వ్యవసాయాన్ని ఉపయోగకరంగా ఉండే విధంగా మట్టి తవ్వకాలు ఉండాలని, పనికి వచ్చిన కూలీలకు మాత్రమే మస్టర్ వేయాలని ఎంపీడీఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎంఎస్ఎన్ రెడ్డి ఏపీవో పాల్గొన్నారు.

డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర: తాళ్లపూడి తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో పంచాయతీ పాలకవర్గం దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని వైయస్ఆర్‌సీపీ సీనియర్ నాయకులు తోట రామకృష్ణ చెప్పారు. పెద్దేవం గ్రామంలో వీధులను విస్తరించి రోడ్లను డ్రైన్లను పక్కాగా నిర్మించే పనులు చేపడుతున్నట్లు చెప్పారు. శుక్రవారం పెద్దేవం గ్రామంలో సర్పంచ్ తిరిగిపల్లి వెంకటరావు, వైస్ ప్రెసిడెంట్ తోట రామకృష్ణ, పాలకవర్గం ఆధ్వర్యంలో సుమారు పది లక్షల నిధులు చేపట్టిన సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఇంటి నాగేశ్వరరావు, కోడి గంగారావు, రామాయ ఇపు త్రిమూర్తులు, బోడపాటి శ్రీను, తోట సోమేశ్వరరావు పాల్గొన్నారు

సమతుల్య పోషకాహారం తీసుకోవాలి

విశాలాంధ్ర - గోపాలపురం : సమతుల్య పోషకాహారాన్ని తీసుకొని బాలికలు రక్తహీనత భారీ నుండి తమ్ముతు తాము కాపాడుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ జోగి వెంకటరమణ తెలిపారు. శుక్రవారం స్థానిక జేబీ స్కూల్ అంగన్వాడి కేంద్రాల ఆవరణంలో కిషోరీ వికాసం యొక్క వేసవి సెలవుల క్యాంపు నిర్వహణను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌమార దశలోని బాలికలు గ్రామీణ పల్లి ప్రాంతాలలో అధిక సంఖ్యలో ఉండి రక్తహీనత బారిన పడుతున్నారని దానిని నివారించుటకు పాలు గుడ్లు, ఆకుకూరలు సమతుల్య పౌష్టిక ఆహారాన్ని దినాహారంగా తీసుకోవాలని కోరారు. యవ్వన దశలో బాల్య వివాహల వైపు ఆలోచించకుండా భవిష్యత్తును గూర్చిన ప్రణాళికల వైపు విద్య, వైపు తమ దృష్టిని సారించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. బాలికలు, మహిళలు అన్ని రంగాల్లో ముందుండేందుకు తమ ప్రతిభను కనబరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు గ్రామ సచివాలయ సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు వర్కర్లు కిశోర బాలికలు, చిన్నారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - నిడదవోలు : నిడదవోలు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని హాస్పటల్ సర్వీసెస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ పద్మ శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఓపీ విభాగంలో రోగులకు అందుతున్న సేవల వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆపరేషన్ థియేటర్‌తోపాటు ఇన్ పేషంట్ జనరల్ వార్డులను పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పరిసరాల పరిశుభ్రత పారిశుధ్య నిర్వహణ తదితర అంశాల పై సూచనలు సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫయాజ్, రవికాంత్, సుష్మారాణి, రెహానా, అస్మత్, త్రినాథ, హెడ్ నర్స్ హెప్సిబా ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - మామిడికుదురు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా చేసుకొని ప్రతీ ఒక్క కార్యకర్త తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నగరం టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షులు జాలెం సుబ్బారావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన నివాసంలో జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. క్రమశిక్షణకి మారు పేరైన తెలుగుదేశం పార్టీలో ఉంటూ పార్టీ, నాయకుల నిర్ణయాలను వ్యతిరేకిస్తూ, పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న టిడిపి కార్యకర్త కుసుమ సువర్ణ బాబును తొలగిస్తూ నగరం టిడిపి గ్రామ శాఖ సమావేశం శుక్రవారం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ, నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్న సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. టీడీపీలో ఉంటూ సమావేశాలకు హాజరు కాకుండా, పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతూ, పార్టీ నాయకులను అవమాన పరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ సువర్ణ బాబు వైసిపి కోవర్టుగా పనిచేస్తున్నారని పలువురు మండిపడ్డారు. సదరు వ్యక్తిని తొలగిస్తూ గ్రామ శాఖ సమావేశం తీర్మానం చేసిన కాపీలను కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి, పి గన్నవరం నియోజక వర్గం కన్వీనర్ నామన రాంబాబు, మామిడికుదురు టీడీపీ మండల శాఖ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్‌లకు అందజేస్తామని టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షులు జాలెం సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరం గ్రామ సర్పంచ్ జాలెం రమణ కుమారి, పార్టీ సెక్రెటరీ గుబ్బల నరసింహ శెట్టి, వార్డు సభ్యులు కోళ్ల సురేష్ బాబు, మొల్లేటి శ్రీనివాస్, రాయుడు ఆనందరావు, జాలెం ఉమా పార్వతీ, కడలి బాబురావు, చెల్లుబోయిన బాపూజీ, వానరాసి తాతాజీ, జాలెం వేంకటేశ్వర రావు, ప్రసాద్, సునీల్, పితాని రామకృష్ణ పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి గ్రామంలో దేవరపల్లి అంగన్వాడీ కేంద్రాలు శుక్రవారం 3.6.9. అంగన్వాడి కేంద్రాల్లో కిషోర్ వికాసం ప్రోగ్రాం ని నిర్వహించారు. అంగన్వాడి సూపర్వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం 11 నుండి 18 సంవత్సరాల లోపు బాలికలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఈ వయసులో 11 గ్రాములు మించి రక్త శాతం ఉండకపోతే జరిగే అనర్ధాలు గురించి వివరించారు రక్తం పెరగడానికి ఇటువంటిఆహారం తీసుకోవాలి ఇటువంటి పద్ధతుల్లో తీసుకోవాలి అనేది అంగన్వాడి కార్యకర్తలు ఏఎన్ఎం తెలిపారు ఐసిడిఎస్ తరపున సెక్టార్ సూపర్వైజర్ ఎం విజయలక్ష్మి ఏఎన్ఎం నాగలక్ష్మి ఎమ్మెస్ కే భార్గవి డి ఆర్ డి ఏ వివో లు స్వరూపరాణి వెంకటలక్ష్మి కృష్ణవేణి గంగాభవాని, అంగన్వాడి కార్యకర్తలు కాంత కుమారి, నాగమణి, శివలక్ష్మి, అంగన్వాడి ఆయాలు స్పందన రమ సుశీల తదితరులు పాల్గొన్నారు. కిషోర్ బాలికలు 25 మంది హాజరైనట్టు అంగన్వాడి సూపర్వైజర్ విజయలక్ష్మి తెలిపారు

ఆకస్మిక విపత్తులపై మాక్ డ్రిల్

విశాలాంధ్ర - కాకినాడ : ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలు, వరదలు వంటి సంక్షోభాలను ఎదుర్కోవడంతోపాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తంచేసి అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్స్ ఉపయోగపడుతుందని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో అనుకోని విపత్తులు సంభవించినప్పుడు ఎదుర్కొనేందుకు ఉద్యోగులు, ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు సంబంధిత శాఖలు మాక్ డ్రిల్స్ నిర్వహించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ మాక్ డ్రిల్ నిర్వహణ వల్ల ప్రజల భద్రత, సన్నద్ధతను గణనీయంగా మెరుగుపడుతుందన్నారు. విపత్తు సమయంలో తీసుకోవల్సిన చర్యల గురించి అవగాహన కల్పించి తద్వారా ప్రజలు గందరగోళానికి గురికాకుండా త్వరగా స్పందించగలరన్నారు. మాక్ డ్రిల్స్ ద్వారా భవిష్యత్‌లో జరిగే నష్టాన్ని అరికట్టవచ్చునని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన మాక్ డ్రిల్స్ నిర్వహణ కార్యక్రమాన్ని కన్నులకు కట్టినట్లుగా సంబంధిత అధికారులు చూపించారు. అగ్నిమాపక సేవలు, ఎస్డిఆర్ఎఫ్, పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ, శిక్షణ పొందిన సిబ్బంది, విద్యుత్ శాఖ, తదితర బహుళ విభాగాలు మాక్ డ్రిల్స్‌లో పాల్గొన్నాయి. కలెక్టర్ కార్యాలయంలో సంభవించిన అగ్ని ప్రమాదం ద్వారా ప్రజలను ఏ విధంగా రక్షించాలో కళ్లకు కట్టినట్లు అగ్నిమాపక సిబ్బంది ఎస్డిఆర్ఎఫ్ సిబ్బంది రక్షణ భద్రత కలిగివుండి ప్రమాద ప్రాంతం నుండి వ్యక్తులను రక్షించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సిపిఆర్, అత్యవసర వైద్యం అందించడంపై అవగాహన కల్పించారు. కలెక్టరేట్ పై అంతస్తులో అగ్నిప్రమాదం సంభవించినట్లు క్రియేట్ చేసి మొదలు నిచ్చెన ఆసరాగా భవనంపైకి విపత్తు స్పందన సిబ్బంది చేరుకుని ప్రమాదంలో చిక్కుకున్నా వారిని క్రిందికి తీసుకువచ్చి తక్షణం వైద్య సహాయం అందించేందుకు 108 వాహనాలు ద్వారా ఆసుపత్రికి తరలించడం వంటి అంశాలను అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ చేశారు. ఈ కార్యక్రమాలను అన్నింటిని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా స్వయంగా పర్యవేక్షించారు. కలెక్టరేట్ ఆవరణలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్ భవనంలో కొంత భాగం కూలిపోయినట్లు క్రియేట్ చేసి అందులో చిక్కుకున్న వారిని ఏ విధంగా కపాడాలో మాక్ డ్రిల్ ద్వారా కళ్ళకు కట్టినట్లు వివరించారు. ఈ మాక్ డ్రిల్లు ఆశాంతం ఆకట్టుకునే విధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జె వెంకట్రావు, 3వ బెటాలియన్ ఎన్డిఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ ఎం మోహన్ రావు, జిల్లా ఫైర్ ఆఫీసరు పివిఎస్ రాజేష్, డిఈఓసి నోడల్ అధికారి, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ఏఎస్డిసి డి భారతి, సమాచార పౌర సంబంధాల శాఖ డిడి డి నాగార్జున, డిపిఓ రవికుమార్, కాకినాడ ఆర్డిఓ మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు శుక్రవారం డ్రైడే

విశాలాంధ్ర - ఏలేశ్వరం : డెంగ్యూ దోమల నిర్మూలనకై ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు సౌభాగ్య సరోజ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవంను పురస్కరించుకుని ఏలేశ్వరం కృష్ణాలయం వీధి అర్బన్ పిహెచ్సి ప్రధాన వైద్యురాలు ఎం సౌభాగ్య సరోజ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా సబ్ యూనిట్ అధికారి ఆనంద్, హెల్త్ సూపర్వైజర్ ఎస్ విజయ లక్ష్మి పర్యవేక్షణలో కె మణికుమార్ ఫార్మసీ స్టాఫ్ నర్స్ వి సూర్య కాంతం, డీఈవో సాయి దర్శన్, ల్యాబ్ టెక్నీషియన్ జ్యోతి ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌభాగ్య సరోజ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ ఆనంద్ మాట్లాడుతూ డెంగ్యూ అనేది వైరల్ ఫీవర్ అని ఇది ఎడిస్ అనే దోమకాటువల్ల వ్యాపిస్తుందన్నారు. ఈ దోమ పగటి పూట కుడుతుందని చెప్పారు. ఇది ఒక్కొక్కసారి ప్లేట్ లెట్స్ పడిపోయి పేషెంట్ ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమములో ఏఎన్ఎంలు ఆశాలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే అధికారులతో ఎంపీ హరీష్ భేటి

విశాలాంధ్ర - అమలాపురం : దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ రీజనల్ మేనేజర్‌తో ఎంపీ హరీష్ మాధుర్ సమావేశం అయ్యారు. కోనసీమ రైల్వే లైన్ భూ సేకరణకు మార్గం సుగమం కానుందని రైల్వే అధికారులకు ఎంపీ హరీష్ వివరించారు. ద్వారపూడి రైల్వే స్టేషన్ సౌకర్యాల పరిశీలనకు ప్రత్యేక బృందాన్ని పంపుతామన్న రైల్వే ఉన్నతాధికారులు దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ రీజనల్ మేనేజర్, చీఫ్ ఇంజనీర్లతో విజయవాడలోని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ సమావేశమయ్యారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ భూ సేకరణ సంబంధిత అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్లు హరీష్ తెలియజేశారు. భూ సేకరణలో ప్రక్రియలో ఎదురైన లోటుపాట్లను, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రైల్వే అధికారులతో ప్రస్తావించడం జరిగిందన్నారు. రైతులకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో వారికి తగ్గ పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. భూ సేకరణ సంబంధిత అవార్డుల జారీ, పరిహారం చెల్లింపు, క్లియరెన్స్ ప్రక్రియ వేగవంతం అయ్యేలా కేంద్ర స్థాయిలో ఇప్పటికే చర్యలు జరుగుతున్నాయన్నారు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని సంబంధిత అధికారులను సన్నద్ధం చేసినట్లు ఎంపీ హరీష్ పేర్కొన్నారు. అలాగే ద్వారపూడి రైల్వే స్టేషన్ సౌకర్యాలపై ప్రయాణికుల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు ఇటీవల రైల్వే స్టేషన్‌ను పరిశీలించడం జరిగిందని అక్కడ విషయాలను రీజనల్ మేనేజర్‌కు హరీష్ వివరించినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన రైల్వే శాఖ అధికారులు ప్రత్యేక బృందాన్ని ద్వారపూడి రైల్వే స్టేషన్ పరిశీలనకు పంపిస్తామని వారి సూచనల మేరకు చర్యలు తీసుకుని ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని రైల్వే ఉన్నతాధికారులు తెలియజేసినట్లు ఎంపీ హరీష్ బాలయోగి వెల్లడించారు.

సత్తా చాటిన ఆదిత్య విద్యార్థులు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం లోని సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఈ-సెట్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకులు సాధించినట్లు ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ ఎన్ సతీష్‌రెడ్డి తెలిపారు. ఏపీ ఈ-సెట్ 2025 పరీక్ష ఫలితాలలో తమ ఆదిత్య విద్యార్థులు స్టేట్ 5, 8 ర్యాంకులతో పాటు వందలోపు 41 ర్యాంకులను సాధించినట్లు పేర్కొన్నారు. స్టేట్ ర్యాంకులు మద్దూరి వినయ్-5వ ర్యాంక్, చీకోలు అమృత 8వ ర్యాంకు సాధించి రాష్ట్రస్థాయి టాప్ పదిలో 2 ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. వీటితోపాటు 100లోపు మొత్తం 41 ర్యాంకులను తమ కళాశాల విద్యార్థులు సొంతం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డా ఎన్ శేషారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్‌టివియస్ కుమార్, డీన్ ఏవీ మాధవరావు, అసోసియేట్ డీన్‌పి శ్రీనివాస్, వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.

ర్యాంకర్ యజ్ఞేశ్వరికి డిఇఇ రాంబాబు అభినందన

విశాలాంధ్ర - అమలాపురం : ఇటీవల ప్రకటించిన ఇ సీఈటి సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అమలాపురం వాసి పితాని యజ్ఞేశ్వరి రాష్ట్ర స్థాయి 28వ ర్యాంక్ సాధించడం పట్ల పంచాయతీ రాజ్ డిఈ భరతమాత డిప్యూటీ ఈఈ అన్యం రాంబాబు అభినందనలు తెలిపారు. ఈ అమ్మాయి 6 నెలలుగా ప్రాజెక్ట్ విభాగంలో ఇండస్ట్రియల్ ట్రైనింగ్ తీసుకొంటూ డిప్యూటీ ఈఈ రాంబాబు వద్ద ప్రోత్సాహంతో ఆయన సమకూర్చిన ట్రైనింగ్ మెటీరియల్, జీపీటి లెక్చరర్స్ సహకారంతో సివిల్ ఇంజనీరింగ్‌పై పట్టు సాధించి ఈ ర్యాంక్ తెచ్చుకోవడమైనదని. ఈ విజయం నాన్న వెంకటరమణ, అరుణలకు అంకితం అని తెలిపింది. చిన్న కార్పెంటర్ అయినప్పటికీ ఎంతో కష్టం చేసి చదివిస్తున్నారని తెలిపింది. ముఖ్యంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌లో డిప్యూటీ ఈఈ రాంబాబు 1993లో ఇదే ఈ సెట్ స్టేట్ 10వ ర్యాంక్ కావడం వల్ల టిప్స్ చెప్పి స్ఫూర్తి నింపారని.. ఫ్యూచర్‌లో మంచి ఇంజనీర్‌గా ఆర్కిటెక్ట్‌గా స్థిరపడాలని ఉందని యజ్ఞేశ్వరి తెలిపింది. ఈ సందర్భంగా అభినందన సభలో ఈఈ పులి రామకృష్ణ రెడ్డి, కాంట్రాక్టర్ ఆంజనేయరెడ్డి, ఎఈలు సత్యనారాయణ, కొండలరావు అభినందనలు తెలిపారు.

ఈ సెట్‌లో కోనసీమ విద్యార్థికి 9వ ర్యాంకు

విశాలాంధ్ర - మామిడికుదురు : ఇటీవల విడుదలైన ఏపీ ఈసెట్ (ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) ఫలితాల్లో అగ్రికల్చర్ ఇంజినీరింగ్ విభాగంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఆదుర్రు గ్రామానికి చెందిన గుబ్బలసాయి మణిరత్నం రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకును సాధించారు. మణిరత్నం విద్యాభ్యాసం ఆదుర్రు, విశాఖ, నర్సీపట్నంలో సాగింది. మణి రత్నం తండ్రి లక్ష్మణరావు శ్యామలాదేవి దంపతులది వ్యవసాయ కుటుంబం. మణిరత్నం మీడియాతో మాట్లాడుతూ తాను వ్యవసాయ శాస్త్రవేత్తగా గుర్తింపు తెచ్చుకోవడంతో పాటు రైతులకు మేలైన యంత్ర పరికరాలను తయారు చేసి వీలైన దిగుబడులు తేవడానికి కృషి చేస్తానని అన్నారు.

19న జాబ్‌మేళా

విశాలాంధ్ర - కాకినాడ : 'వికాస' ఆధ్వర్యంలో ఈనెల 19 సోమవారం 'వికాస' కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడలో 'జాబ్‌మేళా' నిర్వహిస్తున్నారు. ఈ జాబ్‌మేళాలో ఐటెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో టెక్నికల్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఐటిసి లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్లో ఆపరేటర్, మోడిన్ థర్మల్ సిస్టమ్స్ ప్రై.లి.లో అప్రెంటిస్, కెఫిన్‌టెక్‌లో టీమ్ మెంబర్స్, ఇండో ఎంఐఎం, హోండాయ్ గ్లోవిస్, పానాసోనిక్ అండ్ ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంట ర్వ్యూలు నిర్వహిస్తున్నారు. పై ఉద్యో గాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, డిగ్రీ అండ్ బిటెక్ ఉత్తీ ర్ణులైన 35 సం.లోపు అభ్యర్థులు అర్హులు. నెలకు రూ.12,000 నుంచి రూ. 30,000 వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. అలాగే డిడియుజికెవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా టు వీలర్ టెక్నీషియన్, లాజిస్టిక్స్ ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. ట్రైనింగ్ సమయంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 19 సోమవారం 'వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ' వద్ద ఉదయం 9 గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌తో హాజరుకావలెను. మరిన్ని వివరాలకు 779937611 www.vikasajobs.com సంప్రదించవలెను.

వడదెబ్బపై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర - కరప : వడదెబ్బ నుండి రక్షణ పొందేందుకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రతినెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని ఇందులో భాగంగా శనివారం అన్ని గ్రామ పంచాయతీలలో అధిక ఉష్ణోగ్రతలు ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేసేందుకు వడగాల్పులు నుండి రక్షించుకునేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు, మొక్కలు పెంచుట వంటి కార్యక్రమాలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు తెలుపారు. ప్రతి నెల మూడో శనివారం ప్లాస్టిక్ వేద్దాలను వేరువేరుగా సేకరించి అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గొడ్డట్లుపాలెం గ్రామంలో తడి, పొడి చెత్త ప్రజల్లో అవగాహన కల్పించుట జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శి సుధారాణి పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు రూ.600 వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర - శంఖవరం : కాకినాడ జిల్లా శంఖవరం మండలం శంఖవరంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్మికుల, కర్షకులు ఐక్యత వర్ధిల్లాలి, కార్మికులకు హక్కులు కల్పించాలి, గ్రామీణ కార్మికులకు రోజుకి రూ. 600 కూలి ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని, కార్మికులు, కర్షకులకు రక్షణ కల్పించాలని, జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే బందుని జయప్రదం చేయాలని ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి శంఖవరం మెయిన్ సెంటర్ మీదగా అంబేద్కర్ సెంటర్ మీదుగా రామాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మానుకొండ లచ్చబాబు, పార్టీ చింతలూరు లోకల్ కమిటీ కార్యదర్శి దాడి నాగేశ్వరావు, దుమ్ముల సింహాచలం, తాడి లక్ష్మణరావు, జంకల అప్పారావు, తూము చంద్రబాబు, ఆడుగుల అప్పారావు, లోడ అప్పారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - ఆలమూరు : ఇంటి వద్ద నుంచి అదృశ్యమైన వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన ఆలమూరు మండలం లోని జొన్నాడ గ్రామంలో గౌతమి గోదావరి నది చెంతన ఉన్న వ్యవసాయ పొలంలో శుక్రవారం వెలుగుచూసింది. ఏఎస్ఐ సూర్యచంద్ర తెలిపిన కథనం ప్రకారం రావులపాలెం గ్రామానికి చెందిన కుడిపూడి శ్రీను(39) అనే వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందారన్నారు. తమ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించమన్నారు. దీనిపై అతని తండ్రి సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలియజేశారు. పీసీ కానిస్టేబుల్ రాజు,హైవే పోలీస్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారు జన్మదినోత్సవం

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెంలోని తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయం శుక్రవారం వేడుకలతో రసరంజకంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనం దరావు జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం, అన్నదానం, పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ వంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వ హించబడ్డాయి. ఎమ్మెల్యే తన ప్రసంగంలో ప్రజల ప్రేమతోనే ఈ స్థాయికి ఎదగగలిగానని పేర్కొన్నారు. పార్టీ భవిష్యత్ ప్రణాళికలపై ఆయన కార్యకర్తలతో చర్చించారు. ఈ వేడుకలు పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నూరిసప్పటికీ, ప్రజలతో మమేకమైన నాయకుడిగా బండారు సత్యనందరావు మరింత విశ్వాసం పొందారు. ఆ రోజంతా పార్టీ కార్యాలయం సద్భావన, సేవా మానవతా విలువలతో నిండి వుంది.

వైసీపీ ఉభయ గోదావరి జిల్లాలపై సమీక్ష

విశాలాంధ్ర - రావులపాలెం : శాసనమండలి విపక్ష నేత, మాజీ మంత్రివర్యులు , ఉమ్మడి పశ్చిమ తూర్పుగోదావరి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో కాకినాడ డి కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉభయ గోదావరి జిల్లాల సమీక్ష సమావేశంలో పాల్గొన్న అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి మరియు అంబేద్కర్ కోనసీమ జిల్లా కో ఆర్డినేటర్లు , ఎమ్మెల్సీలు , ఎక్స్ ఎంపీలు, ఎక్స్ ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు, ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

FEDBANK
FINANCIAL SERVICES LIMITED

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: యూనిట్ నం.1101, 11వ అంతస్తు, సిగ్నస్, ప్లాట్ నం.71ఎ, పొవై, పాస్పోలి, ముంబై-400087

స్వాధీనత ప్రకటన

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ అధీకృత అధికారియైన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (54 ఆఫ్ 2022) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002, నిబంధన 3తో చదివే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి రుణగ్రహీత, తనఖాదారు, సహ-రుణగ్రహీత(లు) మరియు హామీదారు :- 1. శ్రీ మట్చెర్ల శ్రీనివాసులు తండ్రి రాజులు మట్చెర్ల (రుణగ్రహీత), 2.శ్రీమతి లోవి లోవ లక్ష్మి తండ్రి వీర్రాజు లోవి లకు నోటీసులో ప్రస్తావించిన మొత్తం బకాయి రుణఖాతా FEDKKISTL0536273 నందు ఒప్పంద వడ్డీ రేటు ప్రకారం భవిష్యత్తు వడ్డీ ప్లస్ దానిపై అన్ని వ్యయాలు మరియు యాదృశ్చిక ఖర్చుల వగైరాలతో కలిసి తేదీ: 25.02.2025 నాటికి రూ.13,36,037.00/- (పదమూడు లక్షల ముప్పైఆరు వేల ముప్పై ఏడు రూపాయలు మాత్రమే) లను నోటీసు తేదీ నుండి 60 రోజుల్లో తిరిగి చెల్లించవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ తేదీ : 26.02.2025 న డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.
రుణగ్రహీత/తనఖాదారు/సహ-రుణగ్రహీతలు మరియు హామీదారు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున దిగువ సంతకందారు నిబంధనల్లో తెలిపిన నిబంధన 8తో చదివే చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించిన ఆస్తిని మే 15, 2025 న లాంఛనప్రాయంగా స్వాధీనపర్చుకొనడమైందని ప్రత్యేకించి రుణగ్రహీత/తనఖాదారు/సహ-రుణగ్రహీతలు/హామీదారులకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నిర్వహించరాదని మరియు ఈ ఆస్తితో ఏదేని లావాదేవీలు, రుణఖాతా FEDKKISTL0536273 నందు ఒప్పంద వడ్డీ రేటు ప్రకారం భవిష్యత్తు వడ్డీ ప్లస్ దానిపై అన్ని వ్యయాలు మరియు యాదృశ్చిక ఖర్చుల వగైరాలతో కలిసి తేదీ: తేదీ: 25.02.2025 నాటికి రూ.13,36,037.00/- (పదమూడు లక్షల ముప్పైఆరు వేల ముప్పై ఏడు రూపాయలు మాత్రమే) ల కొరకు ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ చార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి రుణగ్రహీత/తనఖాదారు/సహ-రుణగ్రహీత(లు)/హామీదారు మరియు సాధారణప్రజలను హెచ్చరించడమైనది. హామీగా పెట్టిన ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) యొక్క నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.

షెడ్యూల్-1- తనఖా పెట్టిన ఆస్తి వివరాలు: ఐటెమ్ నం.1: తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు ఎస్ఆర్‌ఓ, గొల్లప్రోలు మండలం, కొడవలి గ్రామం మరియు గ్రామ పంచాయతీ, సర్వే నం.112/2లో డి.నం.6-16, అసెస్‌మెంట్ నం.781 ఆధారంగా గల శ్లాబ్ వేసిన భవనంతో పాటు 167.5 చదరపు గజాలు లేదా 140.7 చదరపు మీటర్ల స్థలం యొక్క ఆస్తి మొత్తంగా. హద్దులు: తూర్పు: ఐటెమ్ నం.2లో 52 అ॥ల స్థలం. పడమర: 52 అ॥ల పంచాయతీ సిసి రోడ్డు, ఉత్తరం: కుక్క రాంబాబుకు చెందిన స్థలం, దక్షిణం: 29 అ॥ల మెయిన్ రోడ్డు.
ఐటెమ్ నం.2: తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు ఎస్ఆర్‌ఓ, గొల్లప్రోలు మండలం, కొడవలి గ్రామం మరియు గ్రామ పంచాయతీ, సర్వే నం.112/2లో మొత్తం 276.5 చదరపు గజాల స్థలం నుండి 109 చదరపు గజాలు లేదా 91.56 చదరపు మీటర్ల ఖాళీ స్థలం యొక్క ఆస్తి మొత్తంగా. హద్దులు: తూర్పు: మట్చెర్ల రాంబాబుకు చెందిన ఇల్లు-52 అ॥లు, పడమర: ఐటెమ్ నం.1లోని 52 అ॥ల స్థలం, ఉత్తరం: కుక్క రాంబాబుకు చెందిన స్థలం-19 అ॥లు, దక్షిణం: మెయిన్ రోడ్డు-19 అ॥లు.

ప్రదేశము : కాకినాడ
తేదీ : 15-05-2025
సం/- (అధీకృత అధికారి)
ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డు తప్పనిసరి

విశాలాంధ్ర - సీతానగరం: మండల లో కౌలు వ్యవసాయం చేస్తున్న రైతులకు సీసీఆర్సి కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని తాసిల్దార్ ఏ శ్రీనివాస్ అన్నారు. ఏ శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ మండలంలో కౌలు వ్యవసాయం చేస్తున్న రైతులు కౌలు కార్డులు (సిసిఆర్సీ కార్డులు) కొరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జూన్ నెలలో పంట కాలంలో మొదలు కానున్న నేపథ్యంలో ప్రభుత్వం అందించే ప్రోత్సాహ కాలు అందాలి అంటే కౌలు కార్డులు కౌలు రైతులు పొందాలని అన్నారు. ఈ కార్డుల దరఖాస్తు నందు సదరు కౌలు రైతు ఏ రైతు వద్ద పొలం చిత్తుకు తీసుకున్నాడో ఆ భూమి వివరాలు, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫోటో, ఫోన్ నెంబర్ మొదలగు వివరములు జతపరిచి సదరు దరఖాస్తును కౌలు రైతు ఏ గ్రామములో వ్యవసాయం చేస్తున్నారో ఆ గ్రామములో గల విఆర్ఓ, విఏఏ లకు అందచేసి, కౌలుకార్డు పొందాలని కోరారు.

డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం డెంగ్యూ దినోత్సవంలో భాగంగా డాక్టర్ జె సతీష్ ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా డాక్టర్ జె సతీష్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తం గా ఉండాలని ముఖ్యంగా దోమల వలన ఈ వ్యాధి వ్యాపిస్తుందని తెలిపారు. ఇండ్లల్లో డ్రైనేజీలు మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని ముఖ్యంగా నీరు నిల్వ ఉంచకూడదు అన్నారు, ముఖ్యంగా కాళీ కొబ్బరి కాయలులో నీరు నిలవ ఉండకుండా చూడాలని అన్నారు, డెంగ్యూ లక్షణాలు గురించి వివరిస్తూ డెంగ్యూ వలన జ్వరం తీవ్రంగా ఉంటుందని కీళ్ల నొప్పులు నోరు ఎండి పారిపోవటం, కళ్లు నొప్పులు ఉంటాయని తెలిపారు. డెంగ్యూ నివారణ చర్యలు తీసుకోవాలని డెంగ్యూ వ్యాధి 80% జ్వరం నివారణకు వేసుకునే మందుల ద్వారా తగ్గుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఏ శ్రీకృష్ణుడు వి అశోక్ వర్ధన్ సూపర్‌వైజర్ ఎన్ వివి సత్యనారాయణ సిహెచ్ రాజు టి సుకుమార్ ఎం బాలకృష్ణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు

ఒంటరి దివ్యాంగులకు 35 కేజీల బియ్యం కార్డు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - కడియం : శారీరక ఒంటరి దివ్యాంగులకు 35 కేజీల బియ్యం కార్డులు మంజూరు చేయాలని వైసీపీ తూర్పుగోదావరి జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షులు ముత్యాల పోసి కుమార్ అన్నారు. ఇటీవల కొత్త రేషన్ కార్డులకు ప్రభుత్వం మంజూరుకు గైడ్ లైన్స్ జారీ చేసిన విషయం విధితమే. ఈ సందర్భంగా పోసి కుమార్ మాట్లాడుతూ 35 కేజీల బియ్యం మంజూరు చెయ్యడం ద్వారా శారీరక ఒంటరి దివ్యాంగ సోదర సోదరీమణులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. దీనికి సంబంధించిన గైడ్‌లైన్స్ వెంటనే జారీ చేయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, ముత్యాల పోసి కుమార్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

గ్రామోత్సవానికి కాంస్య రథం బహూకరణ



విశాలాంధ్ర - అనపర్తి, పెదపూడి : సుమారు రూ.8 లక్షల విలువచేసే కాంస్య రథాన్ని కీర్తిశేషులు సత్తి సూర్యనారాయణ రెడ్డి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అందజేశారు. శుక్రవారం కుతుకులూరుకు చెందిన సూర్యనారాయణ రెడ్డి సతీమణి పద్మావతి, కుమారుడు సత్తి వీర వెంకట సత్యనారాయణ రెడ్డి (దొరబాబు) దంపతులు గ్రామంలోని వివిధ దేవాలయాల ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవానికి రథాన్ని అందించారు. అనంతరం చెరువు వద్ద గల దేవి ఆలయంలో ప్రత్యేక హోమం, అన్నసమారాధన నిర్వహించారు. తదనంతరం నూతన కాంస్య రథంలో అమ్మవారికి సన్నాయి మేళం, కోలాటం, డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి

విశాలాంధ్ర -ఏలూరు: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు నగర కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు నగర సమితి ముఖ్యుల సమావేశం అడ్డగర్ల లక్ష్మీ ఇందిర అధ్యక్షతన ఆర్.ఆర్.పేట స్ఫూర్తి భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో రాష్ట్ర మహిళలకు అనేక హామీలను ఇచ్చి సూపర్ సిక్స్ పథకాలను తీసుకువచ్చి మహిళా అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అనేక వాగ్దానాలను చేశారని గుర్తు చేశారు. ఎన్నికలు పూర్తయి కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు.

మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పథకాలను తక్షణమే అమలు చేయాలని ముఖ్యంగా రాష్ట్ర మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించుకునేందుకు ఈనెల 24న శనివారం ఏలూరు ఏరియా సమితి సమావేశం ఏర్పాటు చేశామని ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు నగర నిర్మాణ బాధ్యులు ఉప్పులూరి హేమ శంకర్, తదితరులు పాల్గొంటారని సమావేశం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు నగర అధ్యక్షురాలు కొండేటి బేబీ మాట్లాడుతూ మహిళా సమాఖ్య మహిళల సమస్యల పరిష్కారం కోసం 70 ఏళ్లుగా దేశంలో అనేక పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో మహిళలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నగర ఉపాధ్యక్షురాలు గొర్లి స్వాతి నగర సమితి సభ్యులు ఉప్పులూరి లక్ష్మి భవాని తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వోబీల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి : ఎంపీ

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : జిల్లాలోని ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో నాలుగు చోట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్‌ఓబి) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడించారు. రైల్వేకి సంబంధించిన సమస్యలపై ఢిల్లీలో నిరంతరం తాను పర్యవేక్షిస్తున్నానని, ఫలితంగా మొదటి విడతగా నాలుగు ఆర్‌ఓబిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపిందని ఎంపీ మహేష్ తెలిపారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమలతో పాటు కొల్లేరు పర్యాటక కేంద్రానికి రాకపోకలు సాగించడానికి వీలుగా జాతీయ రహదారిపై వాహనాల రద్దీని నియంత్రించడానికి భీమడోలు వద్ద

ఒకటి, అప్‌ల్యాండ్ నుండి డెల్టాకు రాకపోకల అవకాశం కల్పించడానికి స్థానిక ప్రజల కోరిక మేరకు కైకరం వద్ద ఒకటి, అప్‌ల్యాండ్ నుంచి జి.కొత్తపల్లి మీదుగా నరసాపురం సముద్ర తీరానికి అనుసంధానించే చేబ్రోలు వద్ద ఒకటి, నల్లజర్ల నుంచి జాతీయ రహదారికి లింక్ రోడ్లను కలుపుతూ హార్టికల్చర్ విశ్వవిద్యాలయానికి వెళ్లే మార్గ మధ్యలో ఉంగుటూరు వద్ద ఒకటి చొప్పున మొత్తం నాలుగు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి అవ సరమైన నిధుల మంజూరు కోరుతూ కేంద్ర ప్రభుత్వా నికి ప్రతిపాదన పంపించగా, తాజాగా అనుమతి లభించిందని ఎంపీ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో రైల్వే సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని అడిగిన వెంటనే తక్షణం స్పందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఆరేడు నెలల్లో ఆర్‌ఓబిల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పేర్కొన్నారు. ప్రస్తుతం మంజూరైన నాలుగు రైల్వే ఓవర్ బ్రిడ్జిలను పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే చేపడుతున్నందున రాష్ట్ర ప్రభుత్వంపై ఒక రూపాయి భారం పడదని, తద్వారా నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి కావడానికి అవకాశం ఉందని ఎంపీ తెలిపారు.

39 నెలల జీతాలు ఇప్పించండి సార్ ....?

విశాలాంధ్ర చాట్రాయి: చనుబండ చెత్త సంపద తయారీలో పనిచేసిన మాకు 39 నెలలు కూలి డబ్బులు నెలకు ఒక్కొక్కరికి రూ.6వేలు చొప్పున మొత్తం రూ. 10 లక్షల వరకు ఇవ్వాల్సి ఉన్న ఇవ్వడంలేదని పైఅధికార్ల ఆదేశాలను పట్టించుకోవడం లేదని మంత్రి సారథికి ప్రజా దర్బార్‌లో ఫిర్యాదు చేశారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో మంత్రి సారథి నిర్వహించిన ప్రజాదర్బార్‌లో చనుబండ గ్రామానికి చెందిన ప్రసాద్ ఫిర్యాదు చేస్తూ మండలంలోని చను బండ చెత్త సంపద తయారీ కేంద్రంలో 2018-20 మధ్యలో తాము కూలీలుగా పని చేశామని స్వచ్ఛభారత్ నుంచి మాకు నెలకు రూ.6వేలు చొప్పున వచ్చిన కూలి డబ్బులను మాకు ఇవ్వకుండా వేరే వారు పేర్లు పెట్టి రూ.10 లక్షలను కాజేశారని, వైసీపీ ప్రభుత్వాల్లో తాము సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నూజివీడులో నిరసన కార్యక్రమాలు నిర్వహించామని జిల్లా కలెక్టర్, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసామన్నారు. అనంతరం తమకు డబ్బులు ఇవ్వాలని తెలిసినప్పటికీ పంచాయతీ కార్యదర్శి నాగరాజు తమకు డబ్బులు ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కరి స్తానని మంత్రి సానుకూలంగా స్పందించారు. చిన్నంపేట గ్రామంలో ప్రభుత్వ నూతనంగా ప్రారంభించిన జూనియర్ కళాశాలలో 31 మంది విద్యార్థులు మొత్తం ఫెయిల్ అయ్యారని చిన్నంపేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కొమ్ము స్రుజన ఫిర్యాదు చేశారు. మంత్రి ఇంటర్ బోర్డు కమిషనర్‌కు సిఫారసు చేశారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ తెలుగు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాస రావు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మద్దపడి బసవరెడ్డి, టిడిపి సీనియర్ నాయ కులు బొట్టురామచంద్రరావు పుచ్చకాయల నోబుల్ రెడ్డి పాల్గొన్నారు.

ఊడిమూడిలో

మాఫియా

విశాలాంధ్ర - పి గన్నవరం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గం పి గన్నవరం మండలం ఊడిమూడి గంటి పెదపూడి లంక ప్రాంతాల్లో విచ్చలవిడిగా రెచ్చిపోతున్న ఇసుక మాఫియా గత కొన్ని నెలలుగా కొంతమంది వ్యక్తులు, అధికారులు, రాజకీయ నాయకులతో కుమ్మక్కయ్యి మండలంలోని ఊడిమూడి లంకలోని గోదావరి నది గర్భంలో అక్రమంగా ఇసుక బొండు, ఇసుక, లంక మట్టిను విచ్చలవిడిగా తవ్వకుని పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ జాతీయ హరిత ట్రిబ్యునల్ రూల్స్‌ను అతిక్రమించి, సిఆర్‌జెడ్ ప్రాంతాలలో భారీగా క్రైన్‌లతో తవ్వుతూ భారీ ట్రిప్పర్ల సహాయంతో ప్రైవేట్ లేఔట్లకు, ఇటుక బట్టిలకు తరలిస్తూ భారీ రేట్లకు అమ్ముకొని సొమ్ములు చేసుకుం టున్న వైనం. ఈ అక్రమ మట్టి, ఇసుక బొండు, ఇసుక తవ్వకాలు జరిగే ప్రాంతాన్ని సిఆర్‌జెడ్ పరిధిలో ఉన్నట్లు గతంలోనే ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈ అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయవలసిన జిల్లా గనుల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ఊడిమూడి రెవెన్యూ గ్రామం పరిధిలో ఊడిమూడి లంకలో కొంతమంది వ్యక్తులు, అధికారులు, రాజకీయ నాయకుల సహాయంతో గంటి పెదపూడి వద్ద గోదావరిపై నిర్మిస్తున్న వంతెన అప్రోచ్ పనుల కోసమని, జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారుల నుండి లంకమట్టిని సరఫరా చేయడం అనుమతులు తీసుకొని భారీ క్రేన్లు సహాయంతో టిప్పర్ల ద్వారా ఊడిమూడి లంక నుంచి గోదావరి ఏటిగట్టు మీదుగా తరలించి జి పెదపూడి వద్ద ఉన్న వంతెనపై నుండి దాటుకుని ఆలమూరు మరియు జొన్నాడ వద్ద ఉన్న ఇటుక బట్టీలకు భారీగా లంకమట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. అదేవిధంగా మట్టి లారీలు జి పెదపూడి వద్ద కాలువపై ఉన్న వంతెన మీదుగా వెళ్లడం వలన వంతెన పూర్తిగా ధ్వంసం అయింది. అక్కడే ఉన్న తాగునీటి పైపులైన్ గొట్టాలు పూర్తిగా ధ్వంసం అయ్యి ప్రజలకు కొన్ని నెలలుగా త్రాగునీరు లేకుండా పోయింది. ఊడిమడి లంక నుండి గంటి పెదపూడి వరకు ఉన్న గోదావరి ఏటిగట్టు మీదుగా భారీ ట్రిప్పర్లతో మట్టిని తరలించుట వలన ఏటిగట్టు పూర్తిగా ధ్వంసం అయింది. దీని కారణంగా వర్షాకాలంలో వచ్చే వరదలకు ఏటిగట్టుకు గండ్లు పడే అవకాశం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై రైతులు, ప్రజలు మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. సిఆర్‌జెడ్ రూల్స్, జాతీయ హరిత ట్రిబ్యునల్ రూల్స్‌ను పూర్తిగా విస్మరించి ఊడిమడి లంక గోదావరి నది గర్భాన్ని పూర్తిగా 20 అడుగుల లోతు వరకు త్రవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. పి గన్నవరం తహసీల్దార్ కేవలం నేషనల్ హైవే నిర్మాణానికి, బ్రిడ్జ్ పనులు నిర్మాణం కొరకు మాత్రమే అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. సిఆర్‌జెడ్ ప్రాంతాలలో త్రవ్వకాలకు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నిస్తే ఏమాత్రం సమాధానం చెప్పడం లేదు. ప్రస్తుతం ఇసుక బొండు ఇసుక త్రవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని సిఎఫ్‌జెడ్ పరిధిలో ఉన్నాయని అటవీ, పర్యావరణ శాఖ అధికారులు తెలుపుతున్నారు. అధికారులు మాత్రం ఈసిఆర్‌జెడ్ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని, ఇప్పటికే రైతులు ఏర్పాటు చేసుకున్న మట్టి రహదారులు, గోదావరి వరద రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఏటిగట్లు పంట కాలలపై నిర్మించిన వంతెనలు, రహదారులు, త్రాగునీటి పైపులైన్లు ఈ అక్రమ మట్టి మాఫియా కారణంగా పూర్తిగా ధ్వంసం అయ్యాయి. లంక ప్రాంతాలలో గోదావరి నది గర్భంలో 20 అడుగుల లోతు వరకు మట్టి తవ్వడం వలన గోదావరి నది గర్భంలో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. రైతుల పంటలు సర్వనాశనం అయ్యాయి. పర్యావరణానికి తీవ్రమైన హాని కలుగుతోంది. దీనిపై రైతులు, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసుకున్నా చర్యలు మాత్రం శూన్యం. అర్ధరాత్రి మట్టి ముసుగులో అక్రమ ఇసుకను తవ్వుతు న్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ అక్రమ మట్టి ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.